క్లుప్తంగా

నేడు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం

పాలకొండ : నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ సర్వేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు. పట్టణంలోని ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారానికి తగిన సూచనలు అందించాలని పేర్కొన్నారు.

క్రీడా విన్యాసం



జాతీయ జెండా చేతపట్టి క్రీడా విన్యాసం చేస్తున్న విద్యార్థినులు

సీతంపేట: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులు క్రీడా విన్యాసం చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూఓ పాలక అమల, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుకు గాయాలు

భామిని: మండలంలోని గజపతినగరం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డ్ కొండగొర్రి లక్ష్మణరావు గాయాలపాలయ్యారు. బత్తిలి స్టేషన్‌లో విధులు నిర్వహించి స్వగ్రామం అత్తికొత్తూరుకు ఆయన బైక్‌పై వెళ్తుండగా ముందు వెళ్తున్న కారును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో గాయాలపాలైన హోంగార్డ్‌ను భామిని పీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలు అందించారు.బైక్ ముందు వెళ్తున్న కారు రోడ్డు గోతులలో సడన్ బ్రేక్ వేయడంతో హోంగార్డు బైక్ కారు వెనుక భాగాన్ని ఢీకొట్టినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



విద్యార్థి యోగేంద్రకు వైద్యసేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మండలంలోని దిగువమండ గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.దేవానంద్ సూచించారు. అదే గ్రామంలోని అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు యోగేంద్ర, చక్రీధర్, పూజిత, శ్రీసాయికృష్ణలు జ్వరంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన.. వైద్యారోగ్య సిబ్బందిని వారి వద్దకు తీసుకువెళ్లి, వైద్యసేవలు అందించారు. ఒకట్రెండు రోజుల్లో తగ్గకపోతే గుమ్మలక్ష్మీపురం గానీ కురుపాం గానీ వెళ్లి అక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి, చికిత్స పొందాలని ప్రధానోపాధ్యాయుడు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం

గరుగుబిల్లి: స్థానిక షిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం భక్తిశ్రద్ధలతో గురువారం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, పూజా కార్యక్రమాల అనంతరం ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో భక్తులతో హోమం చేయించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

గరుగుబిల్లి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ రమేష్‌నాయుడు సూచించారు. మండలంలోని గొట్టివలస గ్రామం వద్ద హెల్మెట్ వాడకంపై గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనాలతో రోడ్లపైకి వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. అలాగే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

గిరిజన యువతకు న్యాయం చేయాలి

పార్వతీపురంటౌన్: ఐదేళ్లుగా గిరిజన ఏకలవ్య పాఠశాలల్లో పనిచేస్తూ ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతకు తిరిగి ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను గిరిజన సంక్షేమ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్ కోరారు. ఈమేరకు ఐటీడీఏ కార్యాలయం ఎదుట జరుగుతున్న నిరసన దీక్షల మూడోరోజు సందర్భంగా గురువారం హాజరైన రంజిత్ కుమార్ మాట్లాడుతూ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సిఫార్సుతోనే గిరిజనేతర అభ్యర్థులు జి.రమేష్‌కు అనసభద్ర, డి.తెజేశ్వరికి కొటికిపెంట ఏకలవ్య పాఠశాలల్లో అడ్డగోలుగా ఉద్యోగాల్లో నియమించారని తెలిపారు. తల్లిదండ్రులు లేని, ఉద్యోగాలు కోల్పోయిన గిరిజన యువతులు లావణ్య, బంగారమ్మలకు మాత్రం తిరిగి ఉద్యోగాలు ఇవ్వడానికి ఇదే మంత్రి శ్రద్ధ చూపడం లేదన్నారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని గిరిజన యువతకు ఉద్యోగాలు ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.



పాలకొండ: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా వెంకమపేట ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలికి సన్మానం



వీరఘట్టం: సంప్రదాయ వస్త్రధారణలతో గిడుగు రామమూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తలవరం హైస్కూల్ విద్యార్థులు



సీతంపేట: గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏపీఓ చిన్నబాబు



జియ్యమ్మవలస: పెదమేరంగి పాఠశాలలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

మహనీయుల అడుగుజాడల్లో నడవాలి



జియ్యమ్మవలస: చినమేరంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విన్యాసం

వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామమూర్తి జయంతి పురస్కరించుకుని, తెలుగు భాషా దినోత్సవం.. ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధికారులు, ఉపాధ్యాయులు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఆయా రంగాల్లో వారు చేసిన కృషిని కొనియాడారు. గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకువచ్చి, నిత్య వ్యవహారంలోని వాడుక భాషలో ఉన్న మాధుర్యాన్ని, విలువను తెలియజేసిన మహనీయుడు గిడుగు రామమూర్తి అని, తనదైన ఆటతీరుతో ప్రపంచ హాకీ చరిత్రలో భారత్ పేరు నిలబెట్టిన గొప్ప క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అని ప్రశంసించారు. ఆదర్శప్రాయుల జీవిత చరిత్రలను అందరూ తెలుసుకుని, ఉన్నతమైన సమాజ నిర్మాణానికి వారి అడుగుజాడల్లో నడవాలని కోరారు. -పాలకొండ, కురుపాం



కొమరాడ కేజీబీవీలో గిడుగు , తెలుగు తల్లి వేషధారణల్లో విద్యార్థులు, పక్కనే ఉపాధ్యాయులు



గుమ్మలక్ష్మీపురంలోని డిగ్రీ కళాశాలలో కవిత్వాల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవరం



భామిని: మోడల్ స్కూల్ తెలుగు పండితులు, పీఈటీని సన్మానిస్తున్న ప్రిన్స్‌పాల్, టీచర్లు



పాలకొండ రూరల్: తంపటాపల్లిలో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



వీరఘట్టం: సంప్రదాయ వస్త్రాలంకరణతో హాజరై విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న చిదిమి పాఠశాల ఉపాధ్యాయులు

ట్రాఫిక్‌కు అంతరాయం



కొమరాడ రోడ్డులో నిలిచిన భారీ వాహనాలు

కొమరాడ: మండల కేంద్రం మీదుగా భారీ వాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్వతీపురం నుంచి కూనేరు వెళ్లే అంతర్‌రాష్ట్ర రోడ్డు అంతా గోతులమయం కావడంతో కొమరాడ సమీపంలో పార్వతీపురం నుంచి రాయగడ వైపు వెళ్తున్న ఓ భారీ లారీ అక్కడి గోతిలో దిగబడిపోయింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు, పాదచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. తరచూ ఇదే దుస్థితి ఏర్పడినా అధికారులు మాత్రం స్పందించడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, భారీ వాహనాల రాకపోకలు మళ్లించాలని, లేదంటే రోడ్డు అయినా బాగు చేయాలని కోరుతున్నారు.

దద్దరిల్లిన ప్రజావేదిక

- ఉపాధిలో కదిలిన అక్రమాల డొంక



ప్రజావేదికలో పాల్గొన్న పీడీ రామచంద్రరావు, ఇతర అధికారులు

వీరఘట్టం: మండలంలో 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు పంపిణీ చేసిన 10,109 సామాజిక పింఛన్లపై ఇటీవల సోషల్ ఆడిట్ బృందాలు చేపట్టిన తనిఖీలపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఏపీడీ శ్రీహరిరావు, ఎంపీడీఓ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావేదికలో రూ. 21.28 కోట్లతో చేపట్టిన 871 పనుల వివరాలను వెల్లడించారు. ఇందులో 825 పనులకు సంబంధించి 17,988 మంది వేతనదారులకు రూ.17 కోట్లు చెల్లించారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ద్వారా 28 పనులను రూ.1.93 కోట్లు.. ఐటీడీఏ ద్వారా పది పనులను రూ.1.79 కోట్లు.. గ్రామీణ నీటిసరఫరా విభాగంలో ఆరు పనులను రూ.34.28 లక్షలు.. సమగ్ర శిక్ష ద్వారా రెండు పనులను రూ.1.52 లక్షలతో చేపట్టారు. ఈ పనులకు సంబంధించి ఎస్ఆర్‌పీ దాసు ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 27 వరకు ఏడు బృందాలు మండలంలోని 34 పంచాయతీల్లో సోషల్ ఆడిట్ చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా పింఛన్లు..

మండల వ్యాప్తంగా 182 మంది పింఛనుదారులు నిబంధనలకు విరుద్ధంగా పింఛన్లు పొందారని తనిఖీలో వెల్లడైంది. దీంతో బాధ్యుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని ఉపాధి పీడీ రామచంద్రరావు ఆదేశించారు. దశుమంతపురం సచివాలయంలో గ్లాస్ డోర్లు వేయకుండానే ఎం.బుక్‌లో నమోదు చేసి 2,15,103 రూపాయలను డ్రా చేసినట్లు గుర్తించారు. దీనికి బాధ్యుడ్ని చేస్తూ ఇంజినీరింగ్ అసిస్టెంట్ సీహెచ్ నవీన్‌ను సస్పెండ్ చేయాలని పంచాయతీ రాజ్ శాఖకు పీడీ రికమండ్ చేశారు. అలాగే మస్తర్లలో సంతకాలు లేక, కొన్ని తప్పుడు మస్తర్ల వల్ల ఉపాధి పనుల్లో 9,74,146 రూపాయలను అడ్డగోలుగా చెల్లించారని గుర్తించారు. నడుకూరు ఫీల్డ్ అసిస్టెంట్ గణపతి వేతనదారులకు సక్రమంగా పనులు కల్పించడం లేదని, వేతనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని సోషల్ ఆడిట్ బృందం నిర్ధారించింది. అలాగే నడుకూరు ఫీల్డ్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండికూడా సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధికి సంబంధించి 2023 ఆగస్టు నుంచి నెలకు రూ.10 వేల పింఛను పొందుతున్నట్లు గుర్తించారు. వెంటనే అతని వద్ద నుంచి పింఛన్ డబ్బులు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు.

లే అవుట్లలో మంచినీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

పార్వతీపురం: అమృత్ 2.0 పథకంలో భాగంగా ఇళ్ల లేఅవుట్లలో మంచినీటి సరఫరా ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లో అమృత్ 2.0 పథకంపై నిర్వహించిన సమావేశంలో జిల్లాలో తాగునీటి ప్రాజెక్టుల పనులు ప్రస్తుత పరిస్థితిపై పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణలతో కలిసి సమీక్ష చేశారు. తాగునీటి పైపుల లీక్‌ల ద్వారా తాగునీరు వృథా అవుతోందని, లేఅవుట్ల వద్ద మంచినీరు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. జిల్లా ప్రజారోగ్య ఇంజినీరింగ్ అధికారి కేజీఎస్ నర్సింగరావు, లేఅవుట్లలో మంచినీటి సదుపాయం కల్పించేందుకు అమృత్ 2.0 పథకం కింద పార్వతీపురం మున్సిపాల్టీకి రూ.5.02 కోట్లు, సాలూరు మున్సిపాల్టీకి రూ.3.20కోట్లు, పాలకొండ నగర పంచాయతీకి రూ. 2.16 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. పథకాలకు సంబంధించి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని తెలపగా పనులు పూర్తిచేసేందుకు కాంట్రాక్టర్‌తో మాట్లాడాలని కలెక్టర్ ఆదేశించారు.

బాధితులకు నష్టపరిహారానికి చర్యలు

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలపై దాడుల కేసుల్లో బాధి తులకు నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల వివరాలను పరిశీలించి విచారణ పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అవసరమైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందజేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న పార్వతీపురం, కురుపాం, పాలకొండ శాసనసభ్యులు బోనెల విజయచంద్ర, తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణలు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసుల్లో వాస్తవాలు తెలుసుకుని కేసులను నమోదు చేయాలని కోరారు. ఆ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, వారికి రావాల్సిన పరిహారాన్ని వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి ఎం.డి గయాజుద్దీన్ మాట్లాడుతూ జనవరి 2024 నుంచి 25 కేసుల్లో వివిధ దశల్లో రూ. 41.25లక్షలు పరిహారంగా మంజూరు చేశామని తెలిపారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, ఏఎస్పీ ఎస్. అంకిత మహావీర్, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు, ఆర్‌డీఓ కె.హేమలత, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవుళ్ల నాయక్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లివిరిలో విష్ణు సహస్ర పారాయణం

భామిని: మండలంలోని లివిరిలో వంశధార నదీ తీరంలో వెలసిన గోపీనాథా రాధాకృష్ణుల సన్నిధిలో గురువారం ఏకాదశి సందర్భంగా భక్తిశ్రద్ధలతో విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట రామగీతా మందిరం అర్చకుడు సూరిబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీపై కేసు నమోదు

వీరఘట్టం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 ఏహెచ్ సామర్థ్యం గల రెండు ఇన్వర్టర్ బ్యాటరీలు ఇటీవల చోరీకి గురైనట్లు ప్రిన్సిపాల్ జీవరత్నం గురువారం చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఇద్దరు యువకులు కాలేజీకి వచ్చి, బ్యాటరీలకు చార్జింగ్ పెట్టాలని చెప్పారని, వారే ఈ దొంగతనానికి పాల్పడినట్లు ప్రిన్సిపాల్ ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గొట్టివలస, మరుపెంట, ఉద్దవోలు, చినగుడబ, పెద్దూరు, బీవీపురం తదితర గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా ట్రాన్స్‌కో ఈఈ కె.వేణుగోపాలరావునాయుడు ఆదేశాల మేరకు 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, కరెంట్ వైర్లకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

గురండి సబ్‌స్టేషన్ పరిధిలో..

భామిని: మండలంలోని గురండి సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు బురుజోల నుంచి గురండి వరకు గల గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తక్షణమే పెండింగ్ కేసులు పరిష్కరించాలి



పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

గరుగుబిల్లి: తక్షణమే పెండింగ్ కేసులను పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. స్టేషన్ పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రాత్రి గస్తీ, పెట్రోలింగ్ చర్యలను ముమ్మరం చేసి, నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ చేసి, గంజాయి, సారా రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ పి.రమేష్‌నాయుడు, తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

వీరఘట్టం: మేజర్ పంచాయతీ కార్యదర్శిగా ఎం.రవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం జిల్లా నౌపడ గ్రామ పంచాయతీలో గ్రేడ్-2 పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగోన్నతిపై వీరఘట్టం వచ్చారు. పారిశుధ్యం పరిరక్షణ, తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, తదితర అంశాలపై దృష్టి సారిస్తానని చెప్పారు.

సుదూర ప్రాంతాలకు డిప్యుటేషన్ సరికాదు..



డిప్యూటీ డీఈఓకు సమస్యలు వివరిస్తున్న బీటీఏ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్

పాలకొండ రూరల్: డివిజన్‌లో చేపడుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటులో సాధ్యాసాధ్యాలను దృష్టిలో పెట్టుకుని విధుల కేటాయింపులు చేపట్టాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తండాడి అనిల్‌కుమార్ అన్నారు. డిప్యూటీ డీఈఓ పి.కృష్ణమూర్తిని గురువారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పాలకొండ డివిజన్‌లో గిరిజన ప్రాంతాలు సుదూరంగా, ప్రయాణానికి వీల్లేకుండా ఉన్నాయన్నారు. ఇక్కడి నియోజకవర్గంలో ఏ మండలం నుంచి అయినా గుమలక్ష్మీపురం 80 కిలోమీటర్ల దూరంలో ఉందని, అక్కడకు సర్దుబాటు చేస్తే చాలా ఇబ్బందులెదురవుతాయని చెప్పారు. సంబంధిత శాఖా మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి ఉపాధ్యాయుల ఇబ్బందులను తీసుకెళ్లాలని కోరారు.

కౌన్సెలింగ్‌కు 70 మంది హాజరు



విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐలో ప్రవేశాల నిమిత్తం గురువారం నిర్వహించిన మూడో విడత కౌన్సెలింగ్‌కు మొత్తం 70 మంది హాజరైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్‌కుమార్ తెలిపారు.

ఇదివరకు రెండు విడతల్లో జరిగిన కౌన్సెలింగ్‌ల్లో పలువురు ఎంపిక కాగా, ప్రస్తుతం 51 మందిని మాత్రమే తీసుకోవడం జరిగిందన్నారు.

మలేరియా, డెంగీపై అప్రమత్తం..

- డీఎంహెచ్ఓ విజయపార్వతి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ విజయపార్వతి

సీతంపేట: మలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి డీఎంహెచ్ఓ విజయపార్వతి సూచించారు. మండలంలోని కుశిమి, దోనుబాయి పీహెచ్‌సీలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడి, వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ల్యాబ్ తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్ , మందుల నిల్వలను పరిశీలించారు. అవసరమైన చోట మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో దోనుబాయి, కుశిమి వైద్యాధికారులు భానుప్రతాప్, చాందిని, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పని అవస్థలు



తలపై ప్లేట్‌లు పెట్టుకుని వర్షంలో భోజనం కోసం క్యూలో ఉన్న విద్యార్థులు

పాలకొండ : నగర పంచాయతీ పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఆశ్రమ పాఠశాల భవన నిర్మాణాలకు కోటి రూపాయలు వెచ్చించి పనులు చేపట్టారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ఆశ్రమ పాఠశాలలో 240 మంది వరకు విద్యార్థులు ఉంటున్నారు. అరకొర గదులు, అపరిశుభ్ర వాతావరణం నడుమ చదువులు సాగుతున్నాయి. మరోవైపు మధ్యాహ్న భోజనం తీరును సాక్షి గురువారం పరిశీలించగా నాణ్యత లేని భోజనం అందిస్తున్నారు. కేవలం పలుచటి చారు, అన్నం పెడుతున్నారు. ఒకవైపు వర్షం పడుతుంటే భోజనం కోసం విద్యార్థులు తలపై భోజనం ప్లేట్‌లు పెట్టుకుని క్యూలో నిలుచోవాల్సి వచ్చింది.

కొనసాగుతున్న వర్ష ప్రభావం



రాజుపేట సమీప పంట పొలాల్లోకి చేరిన వర్షపునీరు

పాలకొండ రూరల్: రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల వ్యాప్తంగా జల వనరుల్లో నీరు చేరుతోంది. ముఖ్యంగా పంట కాలువలు నీటితో కళకళలాడుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి మోస్తారు వర్షం కురవడంతో రైతులు పొలం బాట పట్టారు. వరి చేలకు కీలక దశలో నీరు అందడంతో సంబరపడిపోతున్నారు. మరోవైపు లోతట్టు పొలాలు, కొండ వాలు భూముల్లో అధిక మొత్తంలో వర్షపు నీరు చేరడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నీటిని బయటకు పంపుతున్నారు. పాలకొండ – వీరఘట్టం రహదారితో పాటు రాజుపేట, భాసూరు గ్రామాల మధ్య గల వరి పొలాల్లో నీరు చేరింది.

ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి



శంకర్‌నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

సీతంపేట: వంబరెల్లి గ్రామ రహదారిని పూర్తిస్థాయిలో నిర్మాణం చేసే విధంగా చొరవ చూపించాలని ప్రజా సమాఖ్య నాయకుడు ఎస్.మోహన్‌పాల్‌తో పాటు గ్రామస్తులు ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్‌ను కోరారు. శ్రీకాకుళం వచ్చిన ఆయన్ను గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి రహదారి లేకపోవడంతో అటవీ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకువెళ్లాలన్నా.. రోగులను ఆస్పత్రులకు తరలించాలన్నా ఇబ్బందులు పడుతున్నామన్నారు.